## క్లుప్తంగా

### పేర్నాటిని ఆశీర్వదించండి



**దుత్తలూరు:** తూర్పురాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి కోరారు. మండలంలోని సచివాలయాలు, పాఠశాలలు, మండల కార్యాలయాల్లోని పట్టభద్రులను గురువారం ఆయన కలుసుకుని పేర్నాటికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట దుత్తలూరు బిట్-1 ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార ఇన్‌చార్జి ఉప్పల ప్రసాద్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

### ఎస్ఎఫ్ఐ నేతల వినతి



**ఆత్మకూరు:** ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బీసీ వసతిగృహాల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. గురువారం ఆత్మకూరులోని బీసీ వసతిగృహాలను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని బీసీ సంక్షేమ కార్యాలయానికి చేరుకుని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే నాయబ్‌బాషా, నాయకులు అనిల్, గంగాధర్, బాలాజీ, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

### సంపద తయారీ కేంద్రం పరిశీలన

**ఉదయగిరి:** కొండాయపాళెం పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ గురువారం పరిశీలించారు. గ్రీన్‌అంబాసిడర్లతో ఇంటింటి నుంచి చెత్తను సేకరించి సేంద్రియ ఎరువులను తయారుచేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీ ఆదాయాన్ని పెంచాలని పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీకి సూచించారు. ఆయన వెంట మండల కోఆర్డినేటర్ ఇమ్రాన్ ఉన్నారు.

### ఉపాధి పనుల పరిశీలన



**ఆత్మకూరురూరల్:** పమిడిపాడులో జరుగుతున్న పానుగోడు రోడ్డు జంగిల్ క్లియరెన్స్ పనులను ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. కూలీలకు గిట్టుబాటు కూలి లభించేలా చూడాలని, ఉపాధి పనులు కావాలని కోరిన ప్రతి ఒక్కరికీ కల్పించాలని టీఏకు సూచించారు. ఆయన వెంట ఫీల్డ్‌అసిస్టెంట్ తిరుపతయ్య, మేట్ అరుణ, తదితరులు ఉన్నారు.

### రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం



**వింజమూరు:** ఆరవీటిపల్లిలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను వింజమూరు సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి ప్రధాన వీధి బురదమయంగా ఉండడం గుర్తించి సీసీరోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారని ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన అనాథలు ముడగందు శ్రీలక్ష్మి, హర్షవర్ధన్‌కు ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత శాంతమ్మ రూ.లక్ష నగదు డిపాజిట్ చేసి పత్రాలను అందజేశారని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ దాట్ల రమణారెడ్డి, నాయకులు విజయకృష్ణారెడ్డి, కొండపల్లి రమేష్ పాల్గొన్నారు.

### జీవాల పెంపకందారులకు చేయూత

**వింజమూరు:** గుండెమడకలలోని జీవాల పెంపకందారులకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ గురువారం రూ.2 లక్షలు సాయం అందజేశారు. గ్రామంలోని 250 కుటుంబాలు జీవాల పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు రెండు చేతి బోర్లు, తొట్టెల నిర్మాణానికి నగదు అందజేసినట్లు ఆయన తెలిపారు.

### వేడుకగా ఓబులమ్మ తిరునాళ్ల



**అల్లూరు:** స్థానిక రజక కాలనీలో ఓబులమ్మ తిరునాళ్లను గురువారం వేడుకగా నిర్వహించారు. ఉదయం భక్తులు సామూహికంగా చద్ది నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

# గడప గడపకు సంక్షేమ ఫలాలు



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి రూరల్:** రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల సంక్షేమానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గడప గడపకు వాటిని చేరవేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం పువ్వులదొరువులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూర్చారని విమర్శించారు. రెవెన్యూ సమస్యలు, సర్టిఫికెట్ల కోసం ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం శూన్యంగా ఉండేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సచివాలయాల ఏర్పాటు ద్వారా ఇంటి ముంగిటకే సేవలను తీసుకొచ్చిందని వివరించారు. పింఛన్ కోసం అవ్వాతాతలు గంటల తరబడి క్యూల్లో నిలబడకుండా ఒకటో తేదీ వేకువనే వలంటీర్లు ఇంటికే వచ్చి అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ భూపట్టాలు అందజేస్తాం



ఆర్డీఓను కలిసిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి :** అర్హులైన ప్రతిఒక్కరికీ భూ పట్టాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రైతులతో కలిసి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓ శీనానాయక్‌తో సమావేశమయ్యారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దగదర్తి, బోగోలు, కావలి రూరల్ మండలంలోని అసైన్‌మెంట్ భూములను పేదలకు పంపిణీ చేసేందుకు పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే పట్టాలు ఇచ్చి మిగిలిన అర్హులైన వారికి అన్యాయం చేశారన్నారు. ఈ కారణంగా ప్రభుత్వం అందజేసే రైతు భరోసా, బ్యాంకు రుణాలు అందడం లేదని బాధితులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. అర్హులందరికీ పట్టాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పలు ప్రాంతాల్లోని సమస్యలను ఎమ్మెల్యే విన్నవించగా పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఇస్తీమాకు అన్ని వసతులు కల్పిస్తాం**

ముస్లిం సోదరుల ఇస్తీమాకు అన్నీ వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11,12 తేదీల్లో పట్టణంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి ఇస్తీమాకు స్థలం కేటాయించాలని ముస్లింలు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు పట్టణంలోని మినీస్టేడియాన్ని కేటాయించి ముస్లిం మతపెద్దలతో కలిసి ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా స్థాయి ఇస్తీమాకు దాదాపు ఐదువేల మందికి పైగా ముస్లింలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీ శివారెడ్డి, ముస్లింలు పాల్గొన్నారు.

### మర్యాదపూర్వకంగా..



**జలదంకి:** తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు.

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

**కలిగిరి:** నాగసముద్రం సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### నేడు నైపుణ్య శిక్షణా తరగతులు ప్రారంభం

**ఆత్మకూరు:** ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ఏడీఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణా తరగతులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. తొలుత నెల్లూరుపాళెం సెంటర్‌లోని దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకుని శిక్షణా తరగతులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్చువల్ రియాలిటీ బేస్డ్ సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ, కార్పొరేట్ సంస్థల పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. గతంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగుల ఉజ్వల భవిష్యత్ కోసం నైపుణ్య శిక్షణా తరగతులను ప్రారంభించారని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### దాతలకు సన్మానం



**ఆత్మకూరురూరల్:** నల్లపరెడ్డిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో సర్పంచ్ దొడ్ల శ్రీదేవమ్మ, వెంకురెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బట్టేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పెంచలయ్య మాట్లాడుతూ బట్టేపాడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విద్యాభివృద్ధికి సర్పంచ్ దంపతులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. నల్లపరెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాలకు ల్యాప్‌టాప్, టీవీ, ప్రింటర్, తదితరాలను బహూకరించడమేగాకుండా బట్టేపాడు ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు నల్లపరెడ్డిపల్లి నుంచి రాకపోకలకు సైకిళ్ల ,విద్యలో ప్రతిభకనబరిచే విద్యార్థులకు ఏటా ప్రోత్సాహకాలు అందజేయడం అభినందనీయమన్నారు. పంచాయతీ కార్యదర్శి ఆనంద్, సచివాలయ కార్యదర్శి పద్మజ, నాయకులు ఏడెం పెంచలరెడ్డి, రవీంద్రారెడ్డి, ప్రతాప్, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన



**అల్లూరు:** ఇస్కపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎంపీడీఓ శ్రీదేవి గురువారం పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని భోజన నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ వీరేంద్ర, సర్పంచ్ రంజిత్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ ఉన్నారు.

### పర్వతరెడ్డిని ఆదరించండి



**కావలి :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని పర్వతరెడ్డి రానాప్రమోద్ కోరారు. కావలి డివిజన్‌లోని పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులకు టీచర్ డైరీ, మేనిఫెస్టో అందజేసి ఓట్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు ఎస్ మునీర్, జాన్, రవీంద్రబాబు, రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం



**కొండాపురం:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న మండలాధికారులను తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో ఏవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, గానుగపెంట, పార్లపల్లి, సత్యవోలు సర్వేయర్లు మన్మథ, కృష్ణ, వెంకటకృష్ణను శాలువాలతో సత్కరించారు.

## లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి



లోక్‌అదాలత్‌పై సమీక్షిస్తున్న స్పెషల్ మేజిస్ట్రేట్ రామకృష్ణయ్య

**ఆత్మకూరు:** ఈ నెల 11న ఆత్మకూరు కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయాలని స్పెషల్ మేజిస్ట్రేట్ ఎం రామకృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆత్మకూరు సబ్‌కోర్టులో జాతీయ లోక్‌అదాలత్‌పై పోలీసు అధికారులు, న్యాయవాదులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం, నగదు నష్టపోకుండా వారికి అవగాహన కల్పించి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల ఎస్సైలు, న్యాయవాదులు సమన్వయంతో ఎక్కువ కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుకన్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

### వృత్తి విద్యా కోర్సులపై అవగాహన



**కావలి రూరల్ :** పట్టణంలోని బాపూజీనగర్‌లోని కోరీడ్ సంస్థలో వృత్తి విద్యా కోర్సులపై పేద విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ రావేల జయగోపాల్ మాట్లాడుతూ తమ సంస్థలో టీవీ, సెల్‌ఫోన్ మెకానిజం, కంప్యూటర్ కోర్సులు, టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు.

### నిత్యావసర సరుకుల వితరణ



**ఉదయగిరి:** పట్టణంలోని చిల్డ్రన్స్‌హోం చిన్నారులకు గండిపాళెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గల్లా మురళీకృష్ణ తన తల్లి కౌశల్యమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతకు హోం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, సేవాసమితి సభ్యులు విష్ణునారాయణ, భగవాన్‌శాస్త్రి, హోం నిర్వాహకులు వాణి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## శత్రు, మిత్ర పురుగులను గుర్తించాలి



అల్లూరు: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కన్నయ్య



వరికుంటపాడులో అవగాహన కల్పిస్తున్న ఏఓ

**అల్లూరు:** వరి పంటలోని శత్రు, మిత్ర పురుగులను రైతులు గుర్తించాలని ఏడీఏ కన్నయ్య అన్నారు. నార్త్‌ఆములూరులో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఏడీ పాల్గొని రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పంటకు హానిచేసే శత్రు, మేలు చేకూర్చే మిత్ర పురుగులను గుర్తించడం ద్వారా పురుగుమందుల ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఏఓ వేణుగోపాల్‌రావు, సర్పంచ్ కరిముల్లాషాఖాదర్, నాయకులు పాడేటి డేవిడ్, వీఏఏలు పాల్గొన్నారు.

**యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు**

**వరికుంటపాడు:** రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ జీ కిరణ్ అన్నారు. విరువూరు రైతుభరోసా కేంద్రం పరిధిలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శనగ పంటను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలను సూచించారు. సాంకేతిక సహాయకుడు విజయరాజు, వీఏఏలు శారద, శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

- ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి

**వరికుంటపాడు:** ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. తూర్పురొంపిదొడ్ల సచివాలయం పరిధిలోని డక్కనూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, తదితర వర్గాల ప్రజలు జగనన్న సంక్షేమ పథకాలు, పాలనపై ఆనందం వ్యక్తం చేశారు. సీఎం జగనన్న తమకు అన్నీ ఇస్తున్నాడని ఎమ్మెల్యే ఎదుట సంతోషం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. వయస్సులో చిన్నవాడైనా ఎంతో పరిణతితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సూచికలో మొదటిస్థానంలో ఉందన్నారు. చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్ ఎన్ని తపస్సులు చేసినా అధికారంలోకి వచ్చేది కలేనన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతి పాలైందన్నారు. సీఎం వైఎస్ జగన్ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలుచేకూరేలా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆంధ్రా బాలగురవారెడ్డి, జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, సర్పంచ్‌లు ఉండేల సుబ్బారెడ్డి, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, కొండెపోగు దిలీప్‌కుమార్, నాదెండ్ల రంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగవరపు పుల్లయ్య, గుంటుపల్లి నాగభూషణం, పెండ్యాల తిరుపతయ్య, బొమ్ము వెంకటరెడ్డి, వీవీ నారాయణరెడ్డి, కాకి అంకయ్య, మూలె వీరారెడ్డి, దుగ్గినేని వెంకట్, ఎం.నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూపట్టాలు మంజూరు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

**ఉదయగిరి:** గత కొన్నేళ్లుగా తాము సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కృష్ణారెడ్డిపల్లె గ్రామస్తులు కోరారు. ఈ మేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సానా శ్రీనివాసులరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘ నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ గ్రామంలోని 15 మంది నిరుపేదలు సర్వేనంబర్ 591, 593, 597లోని 20 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వర్షాధార పంటలు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని విన్నవించారు. సాగుభూములకు పట్టాలు మంజూరుచేసి ఆదుకోవాలని కోరారు. ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతులు పాల్గొన్నారు.

### నేడు కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక

**జలదంకి:** మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడి ఎన్నికను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌బాబు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ, 12 గంటలకు నామినేషన్ల పరిశీలన, అనంతరం అభ్యర్థుల ప్రచురణ, మధ్యాహ్నం 1 గంటకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని చెప్పారు. అనంతరం మండల పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించి కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక, ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు తెలిపారు. కోరం లేని కారణంగా, సమయం ప్రకారం కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక జరగకపోతే శనివారం ఉదయం 10 గంటలకు తిరిగి ఎన్నికను నిర్వహిస్తామని వివరించారు.

### కుష్టు వ్యాధిపై అవగాహన

**మర్రిపాడు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కుష్టు వ్యాధిపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ ఎవరికైనా చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, ముక్కు అణిగి ఉండడం, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, తదితర సమస్యలు కుష్టు లక్షణాలని తెలిపారు. కుష్టును ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే మందులతో నయం చేసుకోవచ్చునని తెలిపారు. విద్యార్థులు కుష్టు లక్షణాలపై అవగాహన పెంచుకుని ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ సైదా, ఉపాధ్యాయుడు వెంకటయ్య, వైద్యసిబ్బంది తిరుపతమ్మ, రమణమ్మ, ఓబయ్య పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కోడిపిల్లలను పంపిణీ చేస్తున్న వెటర్నరీ డాక్టర్

**అనుమసముద్రంపేట:** పెరటి కోళ్ల పెంపకం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏఎస్‌పేట పశువైదుడు సుబ్బానాయుడు అన్నారు. మండలంలోని పొనుగోడులోని రైతులకు ఆత్మ సౌజన్యంతో 600 గిరిరాజా కోడి పిల్లలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెరటి కోళ్ల యూనిట్లను రాయితీపై మంజూరు చేస్తోందని తెలిపారు. ఒక్కో యూనిట్‌లో కోడి పిల్లలు, దాణా, మందులు ఉంటాయని వివరించారు. ఆత్మ కన్వీనర్ దేవసేనమ్మ , రైతులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

**సంగం:** మండలంలోని గాంధీజనసంఘం వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. సంగం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి మరమ్మతులకు గురవడంతో రోడ్డుపక్కన నిలిపి ఉన్న కారును అదుపుతప్పి ఢీకొంది. అదే సమయంలో వెనుకగా వస్తున్న లారీ డ్రైవర్ ప్రమాదాన్ని గమనించి టిప్పర్‌ను తప్పించే క్రమంలో లారీ అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ శివప్ప తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు, పోలీసులు వైద్యశాలకు తరలించారు. టిప్పర్ ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు కావడంతో ఘోర ప్రమాదం సంభవించిందని భావించిన స్థానికు లు అక్కడకు చేరుకుని పరిశీలించగా అందులో ఎవరూ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో ఏఎస్‌పేట విద్యార్థుల సత్తా



**అనుమసముద్రంపేట:** రాష్ట్రస్థాయి పోటీల్లో ఏఎస్‌పేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు సత్తా చాటారని హెచ్ఎం హమీద్ తెలిపారు. రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో 66 మంది పాల్గొనగా, పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని చెప్పారు. కర్తి యుద్ధ కళలో ఇద్దరు విద్యార్థులు వెండి పతకాలు సాధించారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులతో పాటు డ్రాయింగ్ మాస్టర్ సుబ్బరాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్‌ను గురువారం ఆయన అభినందించారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి దారుణం

**ఆత్మకూరు:** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్ని రంగాల్లో కేటాయింపులు లేకుండా మొండిచేయి చూపడం దారుణమని సీపీఐ నాయకులు విమర్శించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు బడ్జెట్‌పై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది రాష్ట్రానికి కేటాయింపులు చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వ రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి యామాల మధు, నాయకులు శేషాద్రి, అనిల్, బాలాజీ, నాయబ్, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

**ఆత్మకూరు:** పట్టణంలోని రేషన్ దుకాణాలపై జిల్లా విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. చావడిసెంటర్, సత్రం ఏరియా, సాయిబాబా మందిరం ఎదురు వీధుల్లోని రేషన్‌దుకాణాలతో పాటు ఎండీయూ వాహనాల్లో స్టాక్ రికార్డులు, నిల్వలను తనిఖీ చేశారు. బాలభాస్కర్ రేషన్ దుకాణంలో అవకతవకలను గుర్తించి సీజ్ చేశారు. వీఆర్వో ప్రభావతిని ఇన్‌చార్జిగా నియమించి రేషన్ లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పెంచలరెడ్డి, ఎఫ్ఆర్ఓ గోపాలకృష్ణ, ఏఓ సంగమేశ్వరరెడ్డి, ఏఈ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.